క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండే విఠల్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎండీ రఫీ, కర్నె శ్రీనివాస్ గురువారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మెరుగు మహేశ్వరి, గాదె సత్యం, సుదమల్ల హరికృష్ణ, నాయకులు నడిపెల్లి విజిత్‌రావు పాల్గొన్నారు.

గోళ్ల అనూషకు డాక్టరేట్



మంచిర్యాలటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న గోళ్ల అనూషకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. 'తెలంగాణ రాష్ట్రంలోని ఎంచుకున్న జిల్లాల వ్యవసాయ వస్తువుల వ్యయం, ధర విధానం' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ డి.శ్రీరాములు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

తాండూర్: మండలంలో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అచ్చులాపూర్, రేచినీ, తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సభ్యత్వ నమోదు చేశారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీషను సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించి, ఆమెతో జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి ప్రమాణ స్వీకారం చే యించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రవీందర్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కోసం వినతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను మంజూరు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను కోరారు. ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయంలో గురువారం గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఇతర నియోజకవర్గాల్లో గిరిజన సంక్షేమ గురుకులాలు ఉండగా, బెల్లంపల్లి నియోజకవర్గంలో మాత్రం లేవన్నారు. నియోజకవర్గంలో దాదాపు 30వేల గిరిజన జనాభా ఉందని, అక్షరాస్యతకు దూరంగా ఉంటున్న గిరిజన విద్యార్థుల కోసం గురుకుల పాఠశాల మంజూరు చేయించాలని వేడుకున్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చిన్నయ్య గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడి గురుకుల పాఠశాల మంజూరు చేయాల్సిందిగా కోరారు. సదరు కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కాంగ్రెస్ టికెట్ కోసం శంకర్ దరఖాస్తు



బెల్లంపల్లి: వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ఆ పార్టీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ చిలుముల శంకర్ దరఖాస్తు చేశారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం దరఖాస్తును ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ సభ్యుడు సూరం రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చిన్నరాజం, మాజీ జెడ్పీటీసీ బండి పోశం, నాయకులు వెంకటస్వామి, రాజలింగు, మోమిన్ అలీ, రోమిత్ రమేష్, బీరయ్య, హైమత్, శివశంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ దరఖాస్తు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ నుంచి మంచిర్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు గాను మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు దరఖాస్తును గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీభవన్‌లోని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కొండ చంద్రశేఖర్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, రఘునాథ్ రెడ్డి, మైనారిటీ సెల్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఖలీద్, చెన్నూరు పీసీసీ సభ్యులు నూకల రమేష్ పాల్గొన్నారు.

జీపీల్లో యూపీఐ సేవలు..!

- నెలఖరులోగా జిల్లా వ్యాప్తంగా అమలుకు చర్యలు
- నిధుల వ్యయాలపై ఇక కచ్చితమైన సమాచారం



హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ పంచాయతీల్లో మరింత పారదర్శకతకు ప్రభుత్వాలు నిత్యం దృష్టి పెడుతున్నాయి. నిత్యం ఆదాయ, వ్యయాలపై నిఘా పెడుతూనే ప్రతీ పైసా ప్రజాప్రయోజనాలకు ఖర్చు చేసేలా నిబంధనలు కఠినతరం చేస్తున్నాయి. పంచాయతీ ఆదాయ, వ్యయాల వివరాలు కూడా ఆడిట్ సమయాల్లో వివిధ రకాలుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో పంచాయతీలను మరింత బలోపేతం చేయడంతో పాటు డిజిటల్ పరంగా ముందుకు తీసుకువెళ్లేలా ప్రత్యేక దృష్టి సారించాయి. సాంకేతికత పరుగులు పెడుతున్న తరుణంలో ప్రస్తుతం కూరగాయలు, హోటళ్లు ఇలా చిన్న వ్యాపారాల నుంచి మొదలు ప్రతీ వ్యాపార ఆర్థిక లావాదేవీలన్నీ కూడా స్మార్ట్ ఫోన్ ద్వారా యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్) సేవలు కొనసాగుతున్నాయి. ఇకపై ఈ యూపీఐ సేవలను పంచాయతీల్లో ప్రారంభించేలా నిర్ణయం తీసుకుంది. ఈ నెల చివరి లోగా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 310గ్రామ పంచాయతీల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా సిద్ధం చేస్తున్నారు.

పల్లెపల్లెనా సేవలు..

ఇప్పటికే ప్రతీ పల్లెల్లోనూ యూపీఐ సేవల వినియోగించడం సర్వసాధారణమైంది. డిజిటల్ చెల్లింపులకు అలవాటు పడిన ప్రతీ చిన్న దుకాణాల వ్యాపారులు సైతం యూపీఐ సేవలు వినియోగిస్తున్నారు. పంచాయతీల్లో పన్నుల వసూళ్లు మొదలు, అన్ని కార్యకలాపాలు కూడా నగదు రూపంలో జరుగుతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో జమయ్యే ఆధాయాన్ని వివిధ అభివృద్ధి పనులతో పాటు ఇతర పంచాయతీ కార్యకలాపాలకు వినియోగిస్తుండగా, డబ్బులు పక్కదారి పడుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఆరోపణలకు స్వస్తి పలికేలా పంచాయతీల్లో ప్రజలు నగదు రహిత చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు గాను పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖా ఉత్తర్వులు జారీ చేయగా, పంచాయతీల్లో యూపీఐ సేవలు వినియోగంలోకి వచ్చేలా పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. పంచాయతీల్లోని స్థానికులను నగదు రహిత సేవల వైపు మళ్లించేలా, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో ఇకపై పన్నుల వసూళ్లు, పత్రాల జారీకి పంచాయతీల్లో యూపీఐ ద్వారానే చెల్లింపులు చేపట్టాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం వల్ల పంచాయతీ వ్యవస్థ పూర్తి పారదర్శకంగా మారి అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.



పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న యూపీఐ నమూనా

పారదర్శకత ఉంటుంది..

పంచాయతీల్లో జరిగే ఆధాయ, వ్యయాలన్నీ కూడా యూపీఐ ద్వారా జరిగితే పంచాయతీ కార్యకలాపాల్లో పారదర్శకత ఉంటుంది. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పంచాయతీ వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. ఖాతాలు లేని పంచాయతీల్లో ఖాతాలు ప్రారంభింపజేసి ఈ నెలాఖరులోగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. పంచాయతీ ఆర్థిక కార్యకలాపాలు అన్నీ కూడా, డిజిటల్ వ్యవహారాలుగా సాగుతాయి.



\- వెంకటేశ్వర్‌రావు, డీపీఓ

విశ్వకర్మలకు బీసీబంధు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహచారి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు బీసీబంధు పథకంలో భాగంగా కుల వృత్తులకు అందజేసే రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని తమకు పూర్తిస్థాయిలో అందజేసేలా చూడాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలిక నరసింహచారి కోరారు. హాజీపూర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని 17గ్రామ పంచాయతీల నుంచి మొత్తం 256మంది విశ్వబ్రాహ్మణులు, విశ్వకర్మలు పథకానికి దరఖాస్తు చేసుకోగా, కేవలం ఒక్కరికి మాత్రమే పథకం లబ్ధి పొందినట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు రూ.లక్ష ఆర్థిక చేయూత అందించాలని, దళిత బంధు తరహాలో విశ్వకర్మ బంధు తీసుకురావాలని, రూ.3000పెన్షన్ అందజేయాలని, రాయితీ కరెంట్ వంటి వాటిని ఎన్నికల్లోపు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజుచారి, స్వామిచారి, కోశాధికారి సత్తయ్యచారి, గౌరవ సలహా దారుడు భీమయ్య చారి, గౌరవ అధ్యక్షుడు లక్ష్మీపతిచారి, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌చారి, సభ్యులు సత్తన్నచారి, వెంకటస్వామి, సత్తయ్యచారి పాల్గొన్నారు.

సమాచారం

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనుండగా, నిర్వాహక కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరపాలని నిర్వాహకులు కోరారు.

నేడు దివ్యాంగుల పెన్షన్ పెంపుదల మహోత్సవం

బెల్లంపల్లి: స్థానిక సింగరేణి కళావేదికలో శుక్రవారం దివ్యాంగుల పెన్షన్ పెంపుదల మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9–30గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3016నుంచి రూ.4016కు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని ఆ సందర్భాన్ని పురస్కరించుకుని మహోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దివ్యాంగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి ఇంగ్లిష్, ఎకనామిక్స్ బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ నాగమల్లయ్య తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 28న సోమవారం డెమోకు హాజరు కావాల్సిందిగా కోరారు.

28న భీమారం మండల సభ

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం తెలిపారు. 11గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

నెన్నెల: మండల కేంద్రంలోని సాయి ఇంటర్నెట్ సెంటర్‌లో ఆర్టీసీ కార్గో, కొరియర్ సేవలను మంచిర్యాల ఆర్టీసీ సిబ్బంది మహేష్, రమేష్ గురువారం ప్రారంభించారు. ఆర్టీసీ అందించే ప్రతి పార్సిల్‌కు బరువు, దూరాన్ని బట్టి ధర ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5కే రన్ విజయవంతం చేయండి

నస్పూర్: భారత ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 26న ఉదయం 6గంటలకు మంచిర్యాల నియోజకవర్గ కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు 'నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని ఎన్నికల ఓటరు నమోదు అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, యువతీ, యువకులు, విద్యార్థిని, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించాలి



భీమినిలో నిరసన తెలుపుతున్న ఆశలు



నెన్నెల పీహెచ్‌సీ ఎదుట సమ్మె చేస్తున్న ఆశలు

భీమిని: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలంటూ భీమిని మండలంలోని పీహెచ్‌సీ ఎదుట కూర్చొని గురువారం ఆశలు నిరసన వ్యక్తం చేశారు. నెలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.26వేలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.25లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారిని ఏఎన్‌ఎంగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

తాండూర్: ఆశ వర్కర్లకు చెల్లిస్తున్న పారితోషికాన్ని పెంచాలని తాండూర్ మండల ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు రాజేశం, ఆశలు రాజేశ్వరి, భాగ్య, విజయలక్ష్మీ, స్వప్న పాల్గొన్నారు.

నెన్నెల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశ కార్యకర్తలు సమ్మెకు దిగారు. ఆస్పత్రి ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు అరుంధతి, శైలజ, కిరణ్‌కుమారి, రోజ, స్వప్న, స్వరూప పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశవర్కర్లు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు కవిత, సబిత, ఉమా, వెంకటలక్ష్మి, రాధ ఉన్నారు.

బెల్లంపల్లి: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లిలో ఆశవర్కర్లు ధర్నా చేశారు. మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్ ఎదుట ధర్నా చేశారు.

'సుమన్ హయాంలోనే చెన్నూర్ అభివృద్ధి'



మాట్లాడుతున్న అశోక్‌యాదవ్

భీమారం: ప్రభుత్వవిప్ బాల్క సుమన్ హయాంలోనే చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందని మేకలు,గొర్రెలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ పేర్కొన్నారు. రెండోసారి చెన్నూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా టికెట్ ఖరారు చేసినందుకు గురువారం భీమారం మండలం కాజిపల్లిలో సీఎంకు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌యాదవ్ మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ లేనివిధంగా, మారుమూల గ్రామాలకు సైతం సరైన రోడ్డు రవాణాతో పాటు వంతెనలు నిర్మించిన ఘనత సుమన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో యాదవులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఉద్యోగి కుటుంబానికి భరోసా

నస్పూర్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో అందిస్తున్న యూనియన్ సూపర్ సాలరీ అకౌంట్ ద్వారా ఉద్యోగి కుటుంబానికి భరోసా కలుగుతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా కార్యాలయంలో గురువారం ఆయన జీఎం సంజీవ రెడ్డిని కలిశారు. బ్యాంక్ ఏజీఎం మాట్లాడుతూ.. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సూపర్ సాలరీ అకౌంట్ ద్వారా సుమారు రూ.85లక్షల వరకు ప్రమాదబీమా ఉంటుందని తెలిపారు. యూనియన్ బ్యాంకులో ఉన్న పథకాల గురించి వివరించారు.

పరామర్శ

నస్పూర్: ఇటీవల ప్రమాదవశాత్తు ఇంటిలో జారిపడడంతో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు కాలికి ఫ్రాక్చర్ కాగా, స్థానిక టీబీజీకేఎస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని వెంకట్రావు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్, ఎస్ఆర్‌పీ 3ఫిట్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

అధికారికి సన్మానం

నస్పూర్: జనరల్ మేనేజర్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ కార్పొరేట్ ఎన్.నాగేశ్వర్‌రావు ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఆయనను గురువారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీఎం సంజీవరెడ్డి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం గోపాల్‌సింగ్, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్లు శ్రీనివాస్, పురుషోత్తం పాల్గొన్నారు.

'బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేశవ ప్రసాద్

మందమర్రిరూరల్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బెంగుళూరు ఎమ్మెల్సీ కేశవప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయం ఆవరణలో గురువారం బీజేపీ శక్తి కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల, ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సంజీవరావు, బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు వెంకటేశ్వర్ గౌడ్, డీవీ దీక్షితులు, నరేష్, రమేష్, దుర్గ రాజ్ ఉన్నారు.

చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ



మైలారంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చెన్నూర్: ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

నెన్నెల: చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ విక్రమ్ అడుగుపెట్టడంతో చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైంది. ఈ సందర్భంగా గురువారం మండలంలోని మైలారం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు లింగన్న ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. చంద్రయాన్ అన్వేషణ ఎందుకు పంపారు, చంద్రయాన్ అక్కడ ఏమి చేస్తుందనే వివరాలను విద్యార్థులకు తెలియజేస్తూ వీడియో చూపించారు.

మందమర్రిరూరల్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడంతో పట్టణంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని బురదగూడెంలో గల లిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు గురువారం మార్కెట్ ఏరియాలోని పలు వీధుల గుండా భారతదేశ జెండాలు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, పట్టణ ప్రజలు అంతరిక్ష శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

చెన్నూర్: పట్టణంలో ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో చంద్రయాన్–3 విజయవంతం కావడంపై గురువారం స్థానిక రాజీవ్ రోడ్డు నుంచి ప్రధాన వీధుల్లో జాతీయ పతాకాలు పట్టుకొని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చారు. ఆర్యవైశ్య యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత మధుమేహ పరీక్ష

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గౌతమి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం ఉచితంగా మధుమేహ పరీక్ష నిర్ధారణ, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అంకం రవీందర్ బాబు పాల్గొని మధుమేహం గురించి అవగాహన కల్పించగా, డాక్టర్ నిఖిల్ రెడ్డి బీపీ చెక్ చేసి తగు జాగ్రత్తలు వివరించారు.

వరద బాధితులకు చేయూత

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హనుమాన్ల రాజిరెడ్డి అధ్యక్షతన లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల ఆధ్వర్యంలో వరద బాధితులకు గురువారం 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లు, రెండు బ్లాంకెట్లు అందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వివేక వర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 27వ తేదీ ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ యూత్, స్పోర్ట్స్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను గురువారం లయన్స్ క్లబ్ సభ్యులు ఆవిష్కరించారు. జిల్లాలోని 2018 నుంచి 2023వరకు డిగ్రీ, పీజీ పూర్తయిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'గొల్లకుర్మల అభివృద్ధికి ప్రభుత్వం కృషి'

భీమిని: గొల్లకుర్మల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా అన్నారు. మండల కేంద్రంలో భీమిని గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులకు గురువారం ఆరు యూనిట్లను, కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామానికి ఆరు యూనిట్లను పంపిణీ చేశారు.

హెచ్ఐవీపై అవగాహన

మంచిర్యాలటౌన్: మున్సిపల్ కార్యాలయంలో గురువారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో పనిచేస్తున్న ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు వేలాదిగా ఉంటారని, ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ వ్యాధిపై అవగాహన ఉంటే, ప్రజలకు వివరించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి వి.అనిల్‌కుమార్, నరేందర్ వివరించారు.

'వైద్యులపై ఫిర్యాదు'

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కొందరు సరిగ్గా విధులకు హాజరుకావడం లేదని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఏ ఫ్‌డీవై) జిల్లా కార్యదర్శి పసుపులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. మంచిర్యాల వైద్య విధాన పరిషత్ అధికారికి గురువారం ఫిర్యాదు పత్రం అందజేశారు.

చెన్నూర్‌లో ప్రజా ఆశీర్వాద ర్యాలీ

చెన్నూర్: నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను రెండో సారి ప్రకటించారు. టిక్కెట్ కేటాయించిన అనంతరం తొలిసారిగా సుమన్ చెన్నూర్‌కు వస్తున్న సందర్భంగా 26న నియోజకవర్గంలోని జైపూర్ మండలం ఇందారం ఎక్స్ రోడ్డు నుంచి జైపూర్, భీమారం మండలాల మీదుగా చెన్నూర్ వరకు ఆశీర్వాద ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ శ్రేణులు తెలిపారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: పద్మశాలీ సంక్షేమంతో పాటు రాజకీయ వాటా సాధన కోసం వచ్చే నెల 3న హైదరాబాద్‌లోని కొండ లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణం, సరూర్‌నగర్ స్టేడియం, ఎల్‌బీనగర్‌లో తలపెట్టిన పద్మశాలీ రాజకీయ శంఖారావం సదస్సును విజయవంతం చేయాలని పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు సుదర్శన్ తెలిపారు. పద్మశాలీ భవనంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

జన్నారం: విద్యాశాఖ సమగ్ర శిక్ష ఒప్పందంతో పనిచేస్తున్న ఉద్యోగులకు, ఉద్యోగ భద్రత కల్పించి వేతన స్కేలు అమలు చేయాలని కోరుతూ మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలోని ఉద్యోగులు పోస్టు ద్వారా సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ కమిషనర్లకు వినతి చేశారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు జన్నారం మండల కేంద్రంలో పోస్టు కార్డులను పంపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయకార్యదర్శి తోకల తిరుపతి అన్నారు. కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు స్కీం వర్కర్లు, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మికవ్యతిరేఖ విధానాలకు నిరసనగా ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని ముఖరాం చౌరస్తాలో గురువారం చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు.

దివ్యాంగులకు మరింత భరోసా

నెన్నెల: దివ్యాంగులకు సీఎం కేసీఆర్ రూ.3016 పింఛన్‌ను రూ.4016కు పెంచి దివ్యాంగులకు మరింత భరోసా కల్పించారని ఎంపీపీ రమాదేవి అన్నారు. ఆవుడంలో గురువారం దివ్యాంగులకు పెంచిన పింఛన్‌లను అందజేసి మాట్లాడారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి వద్ద గల ఐఓసీ పెట్రోల్‌బంక్ సమీపంలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై ఓ ఆవు మృత్యువాత పడింది. బంకు పక్కనే గల ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతిచెందింది. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు బోయిన పోచమల్లు కోరారు

సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 6వ వార్డు గర్మిళ్లలో గడపగడపకూ వెళ్లి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

విజయవంతం చేయండి

నస్పూర్: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌సీసీడబ్ల్యూ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్‌లో గురువారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు.